కథ

# దారి మారదు...

ఎమ్.వి.జె.భువనేశ్వరావు

ఆఫీస్ నుండి వచ్చి, సాయంత్రం ఇంట్లో అడుగుపెట్టానో లేదో... శ్రీమతి ఓ కబురు మోసుకొచ్చింది... ఉదయం నుండి రోజంతా అలసిపోయి... వస్తే... ఇప్పుడు మళ్ళా మరో పని తగిలిందేమని నేను మథనపడసాగాను.

"శంకర్రావు చచ్చిపోయాడు" అని ఆమె చెప్పింది తడవుగా... ఆందోళన మొదలైంది... అతడు చచ్చిపోయాడనే బాధకన్నా ముందు వెంటనే ఆ కుటుంబాన్ని పరామర్శించాలనే పని తగిలిందే మన్న భారం తలమీదికొచ్చి పడింది. ఇదెలాగూ తప్పని సరి కార్యక్రమం కాబట్టి... నెమ్మదిగా మనసును అందుకనుగుణంగా మార్చుకోవటానికి సిద్ధమవసాగాను.

"అతడు ఒరిస్సా వెళ్ళి అక్కడ చనిపోయాడంట.. అక్కడి పోలీసులు చెప్తే గాని వీళ్ళకు తెలియలేదు.. "శ్రీమతి చెప్పింది... ఇప్పుడు నాకు శంకర్రావు మరణం కొంచెం బాధ కలిగించింది.. ముఖ్యంగా ఎక్కడో రాష్ట్రంకాని రాష్ట్రంలో కుటుంబ సభ్యులకు దూరంగా వెళ్ళి 'దిక్కులేని చావు' కొని తెచ్చుకున్నాడని బాధేసింది...

"చనిపోయి రెండ్రోజులైందట... వీళ్ళకు కబురు తెలియటం లేటయిందట.. పాపం!"

శ్రీమతి మాటతో కొంచెం స్థిమితపడ్డాను... కాని రేపయినా వెళ్ళాల్సిందే కదా!...

విశ్రాంతి లేని యాంత్రిక జీవనం.... నన్నిలా ఆలోచించేటట్లు చేస్తోంది...

ఇంతలోనే శ్రీమతి మరో బాంబు పేల్చింది...

"వీళ్ళెవరూ... అక్కడికి వెళ్ళటం లేదట..."

"మరెలా... వాళ్ళే పంపిస్తానన్నారా...?"

ప్రశ్నించాను...

"ట్రైన్‌లో చనిపోయారట.. అందుకని రైల్వే పోలీసులు... సాధారణ పోలీసులు... పోస్ట్ మార్టమ్... ఇవన్నీ గొడవలూ ఉంటాయట... అందుకనీ.."

"అందుకని... అక్కడే వదిలేస్తారా?..."

"....ఏమో... నాకు తెలీదు... మీరొకసారి ఫోన్లో వాళ్ళని పరామర్శించండి... విషయం తెలుస్తుంది..."

నాకు మరింతగా బాధేసింది...

అక్కడికెళ్ళి చనిపోవటం శంకర్రావు దురదృష్టం కావొచ్చు... కాని 'అనాథ శవం'గా వదిలేయటం మరింత ఘోరం!

వెంటనే ఫోన్ చేయటానికి ఉపక్రమించాను.

"కామేష్... నేను బాబాయ్‌ని మాట్లాడుతున్నాను..."

కామేష్ శంకర్రావు కొడుకు.

"నమస్తే చిన్నాన్న గారూ..."

"నమస్తే... బాబూ... నాన్నగారు..."

ఎలా అడగాలో తెలియక... తోచక ఆగిపోయాను.

"అవునండి నాన్నగారు చచ్చిపోయేరు..." స్థిరంగా ఉందతని గొంతు.

"అసలు ఏమైంది?..."

"ఒరిస్సాలో ఏదో పనిచేస్తానని వెళ్ళారట... ట్రైన్‌లోనే చనిపోయారట..."

"వెళ్ళారట... అంటున్నావు... నీతో చెప్పకుండా వెళ్ళాడా?.."

"నేనాయనతో మాట్లాడటం లేదు చిన్నాన్న గారూ... ఆయన తండ్రిగా నాకే న్యాయమూ చెయ్యలేదు... నాకోనవే సహాకారమూ అందించలేదు...

"అదేంటి అలా మాట్లాడుతున్నావు... నీ పెళ్ళి దగ్గరుండి ఘనంగా జరిపించాడు కదా..."

"అదంతా నా డబ్బుతోనే చేస్కున్నాను... ఆయన కేవలం దగ్గరుండి జరిపించారంతే! ఆ తర్వాత ఆయన తన ప్రియురాలి దగ్గరికి వెళ్ళిపోయారు... అక్కడే ఉంటున్నారు... అప్పుడప్పుడు ఇక్కడికి వస్తున్నారు...

"... ఎంతైనా తండ్రి కదా!... "

"ఏమోనండి... ఆయనపై నాకా ఫీలింగ్ లేదు... వారం రోజుల క్రితం నా దగ్గరకి వచ్చారు... అతడి ప్రియురాలు... తన వద్ద డబ్బేం లేదనీ... వెళ్ళి భార్య దగ్గరకే వెళ్ళిపొమ్మని చెప్పిందట... ఆరోగ్యం బాగా పాడయిందని నా దగ్గరకొచ్చారు... అమ్మతో కూడా అంతా చెప్పారు... నాన్న ఉండటం అమ్మకి ఇష్టమే కాని నాకిష్టం లేదు... అమ్మనొదిలి

వేరే ఆమె వద్దనున్నాడనే నా కోపం... పైగా నా జీతంతో నా తల్లిని, భార్యను, పిల్లల్ని పోషించగలను... ఆయన తోడయితే నాకు నెలకు అదనంగా మరో మూడు వేలు ఖర్చవుతుంది... అందుకని నేనేం చెయ్యలేను... అన్చెప్పేశాను... గత్యంతరం లేక గతంలో ఆఫీసర్గా పన్చేసిన ఫ్యాక్టరీలోనే ఉద్యోగ ప్రయత్నం చేసేడట.. వాచ్మేన్గా ఉద్యోగమిస్తానన్నారట... అందుకని ఒరిస్సా బయలుదేరి వెళ్ళారు... మందు కొట్టాడో లేక హార్ట్ ఎటాకో చనిపోయాడు..." కామేష్ మాటలు తనని తాను డిఫెండ్ చేస్కుంటున్నట్లుగా ఉన్నాయి తప్ప అది సరయింది కాదని అన్పించింది...

"సరే... చనిపోయాడు... బ్రతికుండగా మనమేమీ సాయం చేయలేక పోయాం... చచ్చి పోయేక కూడా క్షమించలేమా?.." ప్రశ్నించాను...

"ఇప్పుడేం చేయగలం... అవన్నీ తిరగటం, ఆయన కోసం పదివేలో, పదిహేను వేలో ఖర్చుపెట్టటం అనవసరమన్పించింది... అందుకనే వదిలేశాను.."

"చాలా పెద్ద పొరపాటు చేశావు కామేష్... మనకిష్టం లేకపోయినా... సమాజం కోసమైనా మనం కొన్ని చెయ్యాలి... అనాధలకు సేవ చేయటం కోసమే ఎంతోమంది పరితపిస్తుంటారు... అలాంటిది 'కన్నతండ్రి'ని అనాధ శవంగా వదిలేయాలనుకోవటం ఎంతటి దుర్మార్గం... కేవలం డబ్బు ఖర్చవుతుందనే నువ్వు ఆలోచించావు... నువ్వు ఇతరులకు ఏ రకమైన సందేశమిచ్చావో మరచిపోతున్నావు... డబ్బు సంపాదించటం పెద్ద కష్టం కాదు... కాని రేప్పొద్దున నువ్వు కావాలనుకొంటే నీ తండ్రి శవం దొరకదు... ఇంతటి మంచి వాడివయ్యి కూడా... ఒక తరానికి సరిపోని చెడ్డ పేరును తలకెత్తుకొన్నావు... నీపై ఎంతో మందికి నమ్మకం సడలిపోతుంది... ఇప్పటికైనా వెళ్ళి నీ తప్పు సరిదిద్దుకో కామేష్.." అనునయించాను.

"ఉంటా చిన్నాన్నగారు... నేనిప్పుడు డ్యూటీలో ఉన్నాను... మీ మాట పాటించలేను..." ఫోన్ పెట్టేశాడు... చేసేదేం లేక మిన్నకుండి పోయాను గాని... నాలోని సంఘర్షణ ఆగలేదు... మన అభిప్రాయాల్ని ఇతరులపై రుద్దలేం కాబట్టి మౌనంగా ఉండిపోయాను.

× × ×

కాల భ్రమణంలో రెండేళ్ళు గడిచి పోయాయి... అనుకోని విధంగా కామేష్ నుండి నాకు ఫోన్ వచ్చింది... ఆశ్చర్యంతోనూ... ఆతృతతోనూ మాట్లాడాను... "చిన్నాన్నగారూ... నాన్నగారూ... చనిపోయిన దగ్గర్నుండీ ఈ రోజు వరకూ నిరంతరం సంఘర్షణకు లోనవుతూనే ఉన్నాను... నా స్నేహితులు... బంధువులూ ఎవరూ నన్ను నమ్మటం లేదు.. నన్నో దుర్మార్గుడిగానే వారు చూస్తున్నారు... నన్నో కసాయిగా... వారు ట్రీట్ చేస్తున్నారు... ఎంతగా వారిని సమాధాన పరుద్దామనుకొన్నా వారి వైఖరిలో ఏ మార్పు ఉండటం లేదు... నాన్నకు చేసిన అన్యాయం నా శరీరంలోని అణువణువునూ దహించి వేస్తోంది.. ప్రాయశ్చిత్తం చేసుకోవాలని కొన్ని అనాధ శవాలకు నేనే స్వయంగా తలకొరివి పెట్టి దహనం చేశాను... అయినా తృప్తి కలగటం లేదు... చచ్చిపోవాలన్పిస్తోంది...." భోరున విలపించసాగాడు...

"పితృప్రేమ, మాతృప్రేమ అనేవి డబ్బిచ్చి కొనుక్కొనేవి కావు... ఆ ప్రేమనుబంధాల్ని నిలబెట్టుకోవటంలో ఎవరో ఒకరు విఫలమైనా మిగిలినవారు దాన్ని సరిదిద్దాలి... నీ తండ్రి తప్పు చేస్తే... నువ్వు ప్రతీకారంతో అదే తప్పు చేశావు... దాని పర్యవసానమే ఇది...! ఇక ముందే తప్పు జరగకుండా చూస్కోవటమే మనం చేయగలిగింది... బాధపడి ప్రయోజనం లేదు... కనీసం నీ కుటుంబ సభ్యులకైనా నీపై ప్రేమ సడలకుండా చూసుకో... నీ తండ్రికి నువ్విప్వలేకపోయిన ప్రేమని నీ భార్యకీ, పిల్లలకూ పంచు... "నేను చెప్పగలిగింది చెప్పి... ఫోన్ సంభాషణ ముగించాను...

× × ×

మరో సంవత్సరం గడిచిపోయింది... కామేష్ పరిస్థితి ఏమీ బాగా లేదనీ... పైగా ఏదో ప్రమాదం జరిగి బాగా గాయపడ్డాడని... వారి సంసారంలో ఏవో కలతలు రేగాయనీ విషయం తెలిస్తే... వెంటనే బయలుదేరి వెళ్ళాను... ప్రమాదంలో బాగా గాయపడినట్లుంది... ఒక కాలు తీసేశారు... చూడగానే గుండె ద్రవించిపోయింది.. అతడి కాళ్ళ వద్ద అతని తల్లి కూర్చొని ఉంది.. కొంచెం దూరంగా అతడి భార్యాపిల్లలు నిలబడి ఉన్నారు... వారివేపు దీనంగా చూస్తూ కామేష్ రోదిస్తున్నాడు... తల్లి కూడా కళ్ళు తడిచేసుకొంది.. భార్య మాత్రం ఆగ్రహంతో ఊగిపోతోంది... నన్ను చూడగానే ఆమె మరింత గట్టిగా మాట్లాడ సాగింది... "అవును కామేష్... నేనూ నా దారి చూసుకోవాలనుకొంటున్నాను... ఇప్పటి దాకా నువ్వు మమ్మల్ని పోషించావు నిజమే... కాని ఈ రోజు నుండి నిన్ను మేం పోషించాలి... నేనూ పిల్లలు బ్రతకటమే ఎంతో కష్టం... పైగా మంచాన పడ్డ నీకు వైద్యం చేయించి, తిండి పెట్టి, మమ్మల్ని మేం పోషించుకోవటమంటే అసాధ్యం. నా క్లాస్మేట్ రవితో పెళ్ళికి నా తల్లిదండ్రులు అప్పుడు ఒప్పుకోక మా వివాహం జరగలేదు... అతని భార్య ప్రమాదంలో మరణించిందట... నన్ను పెళ్ళాడటానికి ఒప్పుకొన్నాడు... పిల్లల్ని కూడా తనే చూస్కుంటానని మాటిచ్చాడు.. ఇన్నేళ్ళ మన కాపురంలో నువ్వు మాకు తిండి పెట్టావు తప్పితే అంతకుమించి చేసిందేమీ లేదు.. దానికి ప్రతిఫలంగా ఇంటిపని, వంటపని, చాకలిపని అన్నీ చేశాను... నువ్వు నాకు బంగారు వడ్డాణాలు కొనలేదు... పట్టుచీరల్లో ఊరేగించనూ లేదు... కన్నతండ్రి చనిపోతే... నిర్దాక్షిణ్యంగా వదిలేశావు... నువ్వు బాగా ఉన్నా చూస్తావనే నమ్మకం లేదు... ఇక అవిటితనంతో మంచాన పడి నువ్వు మాకు చేసేదేముంటుంది... నీ తండ్రిపైన కోపంతో నువ్వాపని చేశావు... మేం మాత్రం మా బంగారు భవిష్యత్తు కోసమే ఈ పని చేస్తున్నాం... దయచేసి అర్థం చేసుకొంటావని భావిస్తున్నాను..."

కామేష్ ఏమీ మాట్లాడలేక వెక్కివెక్కి ఏడుస్తున్నాడు... ప్రాధేయ పూర్వకంగా చూశాడు నావేపు. ఆమెకి సర్ది చెపుదామని ప్రయత్నించ బోయాను... అప్పటికే ఆమె మమ్మల్ని దాటి వెళ్ళిపోయింది.

"అనుబంధమనేది ఇలాంటి స్వార్థ చింతనల కతీతమైనది. ఎవరో ఒకరు తప్పు చేశారనీ.. వారిపై కక్ష పెంచుకొని బాధించటం మొదలుపెడితే అదసలు అనుబంధమే కాదు... మంచయినా చెడయినా... కష్టమైనా నష్టమైనా ఇష్టమున్నా... లేకపోయినా... వారసులుగా మనం కొన్ని బాధ్యతలు నిర్వర్తించక తప్పదు... ఆ సంప్రదాయాన్ని మనం కొనసాగించాలి... ఆ బాధ్యతని నువ్వు విస్మరించావు... ఆ సంప్రదాయాన్నీ నువ్వు త్రుంచేశావు... నువ్వు వెళ్ళిన దారిలోనే వారూ వెళ్ళారు... ఇప్పుడు బాధపడి చేసేదేం లేదు... ఇప్పుడేం చేసినా చేతులు కాలాక ఆకులు పట్టుకోవటమే..." నేను చెప్పింది... కామేష్ మస్తిష్కంలో చేరగానే ఉబికి వస్తున్న కన్నీళ్ళు... అక్కడికక్కడే ఇంకిపోయాయి... నేనూ మౌనంగా అక్కడి నుండి నిష్క్రమించాను.